నమస్తే తెలంగాణ
కామారెడ్డి
10 | నిజామాబాద్, శుక్రవారం 11 అక్టోబర్ 2024 | KAMAREDDY

కామారెడ్డిలోని పంచముఖి హనుమాన్ మందిరం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పోచారం గ్రామంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే పోచారం

అంబరమంటిన సద్దుల సంబురం

- ఉమ్మడి జిల్లాలో వైభవంగా పూలపండుగ
- 'మళ్లీ రా బతుకమ్మ' అంటూ వీడ్కోలు పలికిన మహిళలు

కామారెడ్డిలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబురాలు ఉమ్మడి జిల్లాలో అంబరాన్నంటాయి. ఎనిమిదిరోజులపాటు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడిన మహిళలు గురువారం సద్దుల బతుకమ్మను అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. ఊరూ వాడా పూలవనాలను తలపించాయి. ఆడపడుచులు గౌరీ దేవీని కీర్తిస్తూ పాటలు పాడారు. మహిళలందరూ ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి లయబద్ధంగా తిరుగుతూ పాటలు పాడారు. సకల సౌభాగ్యాలు అందించుమా... మళ్లీ వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా అంటూ వీడ్కోలు పలికారు. పసుపు, బొట్లు, వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం వెంట తెచ్చుకున్న సద్దులను ఆరగించారు.

–సుభాష్‌నగర్/ కామారెడ్డి

మాచారెడ్డిలో బతుకమ్మ సంబురాలు

లింగంపేట మండలం శెట్పల్లి గ్రామంలో..

నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బాన్సువాడ మండలం కొల్లూర్‌లో..

అధికారులు పనితీరు మార్చుకోవాలి

- డంపింగ్ యార్డు నిర్వహణ అధ్వానం
- పిట్లం ఎంపీవో, జీపీ కార్యదర్శిపై కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆగ్రహం
- నోటీసులు జారీ చేయాలని డీఎల్పీవోకు ఆదేశం


పిట్లంలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

పెద్దకొడప్‌గల్, అక్టోబర్ 10: అధికారులు పనితీరు మార్చుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. గురువారం ఆయన పిట్లం మండల కేంద్రంలో పర్యటించారు. డంపింగ్ యార్డు, ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. డంపింగ్ యార్డు నిర్వహణ అధ్వానంగా ఉందని, అధికారుల పనితీరు సక్రమంగా లేదని ఆగ్రహం వ్యకంచేశారు. ఎంపీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శి యాదగిరికి నోటీసులు జారీ చేయాలని డీఎల్పీవో నాగరాజును ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానకు వెళ్లి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, పనికిరాని పరికరాలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. వైద్యులు,సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. దవాఖానలో టాయిలెట్స్ లేవని వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. ప్రతిపాదనలు పంపించాలని ఆయన సూచించారు. ఎల్ఆర్ఎస్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో కమలాకర్, తహసీల్దార్ వేణుగోపాల్, వైద్యులు రవీంద్ర కుమార్, విజయ లక్ష్మి తదితరులు ఉన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

- ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి


లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్/ మెండోరా/ ఏర్గట్ల, అక్టోబర్ 10: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కి, ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కల్యాణ లక్ష్మి కింద ఇచ్చే రూ. లక్ష ఇస్తున్నారే తప్ప.. తులం బంగారం ఇవ్వడంలేదని మండిపడ్డారు. తులం బంగారం ఎప్పుడిస్తారని సీ ఎం రేవంత్‌రెడ్డిని వేముల ప్రశ్నించారు. గురువారం ఆయన ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల మండల కేంద్రాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడు తూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కాలం దగ్గర పడుతున్నదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలుచేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశా రు. ఆడబిడ్డల కుటుంబాలకు అండ గా నిలబడాలనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఎంతో మంది పేద ఆడబిడ్డల కుటుంబాలను ఆదుకున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన లక్ష రూపాయలు మాత్రమే ప్రస్తుత రేవంత్ సర్కా రు ఇస్తున్నదని, తులం బంగారం మాత్రం ఇవ్వడంలేదని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. ముప్కాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి వేము ల మా ట్లాడుతుండగా కాంగ్రెస్ కార్యకర్తలు సభను అడ్డుకునే యత్నం చేశారు. తులం బం గారం ఎక్కడ అని వేముల ప్రశ్నించడంతో సభను రసాభాసగా మార్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని కాంగ్రెస్ కార్యకర్తలను బయటికి పంపించారు. ఇదిలా ఉండగా.. ఏర్గట్లలో చెక్కుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్నంత సేపు రైతువేదిక ఆవరణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేసుకున్నారు.

అక్కాచెల్లెలు ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ చెల్లెలు మృతి
- అడ్లూర్ ఎల్లారెడ్డిలో ఘటన

రామారెడ్డి, అక్టోబర్10: అక్క ఆత్మహత్యకు యత్నించగా..విషయం తెలుసుకున్న ఆమె చెల్లెలు బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో చోటుచేసుకున్నది. సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన గురజాల కిషన్‌కు ఇద్దరు కూతుళ్లు మమత, ప్రత్యూష(23) ఉన్నారు. పెద్దకూతురు మమతను రామారెడ్డి మండలం మోషంపూర్ గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెండ్లి చేశారు. కొంతకాలంగా కుటుంబ కలహాలు తలెత్తడంతో మమత పదిరోజుల క్రితం తల్లిగారింటికి వచ్చింది. జీవితంపై విరక్తి చెంది ఈ నెల7న మమత పురుగులు మందు తాగగా.. ఈ విషయం తెలుసుకున్న ఆమె సోదరి ప్రత్యూష కూడా పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబీకులు వారిద్దరిని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ప్రత్యూష బుధవారం మృతిచెందగా.. మమత చికిత్స పొందుతున్నట్లు ఎస్సై తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎవరిని ఏడ పెట్టాలో బాగా తెలుసు

- కొందరు దుర్మార్గులు అభివృద్ధికి అడ్డం పడుతుండ్రు
- కేసీఆర్ దయ వల్ల పేదలకు ఇండ్లు అచ్చినయ్
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

రుద్రూర్, అక్టోబర్ 10: 'రాజకీయంగా నాకు చాలా అనుభవం ఉంది. ఎవరిని ఏడ పెట్టాలో నాకు బాగా తెలుసని' బాన్సువాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కొందరు దుర్మార్గులు అభివృద్ధికి అడ్డం పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ దయ వల్ల బాన్సువాడలో పేదలకు ఇండ్లు వచ్చాయన్నారు. వర్నిలో గురువారం నిర్వహించిన స్థానిక ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారంలో పోచారం మాట్లాడారు. కాంగ్రెస్‌లోకి తాము వస్తుంటే కొందరు స్వాగతించారని, మరికొందరు దుర్మార్గులు అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. అనవసరంగా రాజకీయం చేసి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. లేదంటే ఎవరిని ఎక్కడ పెట్టాలో తనకు తెలుసన్నారు. ఏనుగు రవీందర్‌రెడ్డిని బాన్సువాడలో అడుగు పెట్టొద్దని సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పినా వినకుండా కొంతమందిని రెచ్చగొట్టి, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నాడని విమర్శించారు. కేసీఆర్ దయ వల్ల పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందాయని, ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు రూ.5 లక్షల చొప్పున ఇవ్వనున్నదని, నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. అర్హుల జాబితా తయారు చేయాలని అధికారులకు సూచించారు. త్వరలోనే రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్‌లు, ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందించనున్నట్లు తెలిపారు. గతంలో మార్కెట్ కమిటీలో అవకతవకలు జరిగాయని, నూతన కార్యవర్గం ఎలాంటి అక్రమాలకూ చోటివ్వకుండా అభివృద్ధి బాటలో నడిపించాలని సూచించారు. రుణమాఫీ కాని రైతుల కోసం త్వరలోనే రూ.13 వేల కోట్లు విడుదల చేయనున్నట్లు ఎంపీ సురేశ్ షెట్కార్ తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ కాలేదన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, నేతలు పోచారం భాస్కర్‌రెడ్డి, కూనీపూర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం, పక్కన ఎంపీ సురేశ్ షెట్కార్ తదితరులు